రోడ్లు అద్దాల్లా ఉండాలి

- ఆర్అండ్‌బిలో పాలనా సంస్కరణలు
- ఐదు నియోజకవర్గాలకు ఒక ఎస్ఇ
- డిసెంబర్ రెండో వారంలోగా టెంటర్లు ఖరారు
- ఇంజనీర్లు చైతన్యవంతంగా ఆలోచించాలి : సిఎం కెసిఆర్



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో రోడ్లు అద్దాల్లా ఉండాలని, ఒత్తిడి, వరదల కారణంగా పాడైన రోడ్లను ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయాలని ముఖ్యమంత్రి కెసిఆర్ ఆర్అండ్‌బి, పంచాయతీరాజ్ శాఖ అధికారులను ఆదేశించారు. సౌకర్యవంతమైన ప్రయాణానికి వీలుగా నిరంతరం నిర్వహణ పనులు చేపట్టాలన్నారు. రాష్ట్రంలో చోటు చేసుకుంటున్న గుణాత్మక ప్రగతికి అనుగుణంగా క్షేత్రస్థాయిలో కావాల్సినంత సిబ్బందిని నియమించుకుని, బాధ్యతల వికేంద్రీకరణ దిశగా చర్యలు చేపట్టాలని అధికారులకు సిఎం కెసిఆర్ స్పష్టం చేశారు. రోడ్లు భవనాల శాఖ, పంచాయతీ రాజ్ శాఖల పరిధిల్లో క్షేత్రస్థాయిలో పనులను మరింత పటిష్టపరిచేందుకు చేపట్టవలసిన నియామకాలు, తదితర అభివృద్ధి కార్యాచరణపై గురువారం సిఎం కెసిఆర్ అధ్యక్షతన ప్రగతిభవన్‌లో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం జరిగింది. సంప్రదాయ పద్ధతిలో కాకుండా చైతన్యవంతంగా విభిన్నంగా ఇంజనీర్లు ఆలోచన చేయాలన్నారు. రాష్ట్రంలో రోడ్ల పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించుకుని, వర్షాలు, వరదలకు పాడైన రోడ్లకు ఎప్పటికప్పుడు మరమ్మత్తులు చేయాలని సూచించారు. అవసరమైతే ఆర్అండ్‌బి, పిఆర్ శాఖల్లో పరిపాలన సంస్కరణలు అమలు చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో మరింత మంది ఇంజనీర్లను నియమించుకోవాలని సూచించారు. ఇతర శాఖల మాదిరే ఆర్ అండ్ బి శాఖకు కూడా ఇఎన్‌సి అధికారుల విధానం అమలు చేయాలన్నారు. ప్రతి 5 లేదా 6 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఒక ఎస్ఇ ఉండే విధంగా, టెర్రిటోరియల్ సిఇలను కూడా నియమించాలన్నారు. పటిష్టంగా పనులు జరగాలంటే ఎస్ఇలు, ఇఇల సంఖ్య ఎంత ఉండాలో ఆలోచన చేయాలన్నారు. పెరుగుతున్న పనిని అనుసరించి ప్రతిభావంతంగా పర్యవేక్షణ చేసే దిశగా పని విభజన జరగాలన్నారు. కిందిస్థాయి ఇంజనీర్లు మరమ్మత్తులు తదితర పనులకు సత్వర నిర్ణయం తసుకుని పనులు చేపట్ట దిశగా నిధుల కేటాయింపు, వంటి మార్గాలను అవలంబించాలన్నారు. ఇందుకు సంబంధించి వర్క్ షాపులు నిర్వహించుకుని తగు నిర్ణయాలు తీసుకోవాలని సిఎం అన్నారు. ఇందుకు సంబంధించి అధికారులు సమీక్షించుకుని ప్రభుత్వానికి తుది నివేదికను అందచేస్తే వచ్చే కేబినెట్ సమావేశంలో చర్చించి ఆమోదించే అవకాశమున్నదని సిఎం తెలిపారు.

కెజివీల్స్ ట్రాక్టర్స్..కఠిన నిబంధనలు..

రోడ్ల మరమ్మత్తుల కోసం టెండర్లు పిలిచి వారంలోగా కార్యాచరణ ప్రారంభించాలని సిఎం ఆదేశించారు. అందుకు సంబంధించిన కార్యాచరణపై తక్షణమే దృష్టి కేంద్రీకరించాలని ఆర్అండ్‌బి మంత్రిని ఉన్నతాధికారులను సిఎం ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో కెజివీల్స్‌తో ట్రాక్టర్లను నడపడం ద్వారా రోడ్లు పాడవుతున్న విషయాన్ని అధికారులు సిఎం దృష్టికి తెచ్చారు. ఈ దిశగా రైతులను ట్రాక్టర్ ఓనర్లు డ్రైవర్లను చైతన్యం చేయాలని, ఇందుకు సంబంధించి కఠిన నిబంధనలు అమలు చేయాలన్నారు.

పంచాయితీ రాజ్ శాఖ ఇంజనీర్లు వారి శాఖ ఫరిధిలోని పాడయిన రోడ్లను గుర్తించి మరమ్మత్తులు చేపట్టాలన్నారు. అటవీ భూములు అడ్డం రావడం ద్వారా రోడ్ల నిర్మాణం ఆగిపోతే, సమస్య పరిష్కారానికి అటవీశాఖతో సమన్వయం చేసుకోవాలని సిఎం అన్నారు. రోడ్లకు వాడే మెటీరియల్ ఉత్పత్తిని హైద్రాబాద్ కేంద్రంగా చేసుకోవాలని తద్వారా సమయాన్ని నాణ్యతను కాపాడుకోవచ్చున్నారు. అందుకు సంబంధించి చర్యలు చేపట్టాలని అధికారులకు సిఎం సూచించారు.

సాఫ్ట్‌వేర్‌తో రోడ్ల పర్యవేక్షణ

రోడ్ల మెయింటెనెన్స్ పనులు సమర్ధవంతంగా వుండాలంటే ఆ భాధ్యతను ఏ స్థాయి ఇంజనీరుకు అప్పగించాలో కూడా నిర్ణయించుకోవాలని సూచించారు.వానలు వరదల కారణంగా తెగిపోయిన రోడ్ల మరమ్మత్తులకు, సాధారణ రోడ్ల మరమ్మత్తులకు మొదటి ప్రాధాన్యతనివ్వాలని రోడ్లు భవనాల శాఖ మంత్రిని అధికారులను సిఎం ఆదేశించారు. ఇరిగేషన్ శాఖ వారి మాదిరి వొక సాఫ్ట్‌వేర్ అప్లికేషన్‌ను తయారు చేసుకుని రోడ్లను నిత్యం పర్యవేక్షించాలన్నారు. వచ్చే నెల రెండో వారం లోపు టెండర్లు పూర్తికావాలన్నారు. రోడ్లు ఎక్కడెక్కడ ఏమూలన పాడయ్యాయో సంబంధించిన పూర్తి వివరాలు క్షేత్రస్థాయి ఇంజనీర్ల దగ్గర వుండాలన్నారు.

సూపర్ స్పెషాలిటీల్లో ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేయాలి ..

రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ దవాఖానాలను పటిష్టంగా నిర్మించాలని సిఎం తెలిపారు. ప్రజల సౌకర్యార్థం వరంగల్ హైదరాబాద్‌లలో నూతనంగా నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ దవాఖానాలో ఇఎన్‌టి, డెంటల్ ఆప్తమాలజీ, విభాగాలకోసం ఒక ఫ్లోర్‌ను కేటాయించాలని సిఎం తెలిపారు. ఈ సందర్భంగా సిఎం దవాఖానాల నిర్మాణాల నమూనాలను పరిశీలించారు. నూతన దవాఖానాలను మెడికల్ విద్యార్థులకు, ప్రజల వైద్య సేవలకు అనుగుణంగా నిర్మించాలని సిఎం అన్నారు. కర్పొరేట్ దవాఖానాలకు ధీటుగా వరంగల్‌లో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ దవాఖానా నిర్మాణం కావాలని సిఎం ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రులు, వేముల ప్రశాంత్ రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, వి.శ్రీనివాస్ గౌడ్, రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సమీక్ష సమావేశం అనంతరం సిఎం కెసిఆర్ నూతన సచివాలయ నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రతి అంతస్తులో కలియ తిరుగుతూ నిర్మాణ సంస్థ సిబ్బందికి సూచనలు చేశారు.సిఎం వెంట మంత్రులు, ఉన్నతాధికారులు ఉన్నారు.

అనాథ శవాలను మెడికల్ కాలేజీలకు అప్పగించండి

- డిజిపి ఉత్తర్వులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అనాథ శవాలను మెడికల్ కాలేజీలకు అప్పగించాలని రాష్ట్ర పోలీస్ శాఖ నిర్ణయించింది. రాష్ట్రంలో మెడికల్ కాలేజీల సంఖ్య పెరిగిన విషయం తెలిసిందే. అయితే అనాటమీ తరగతులు, పరిశోధనల కోసం మృతదేహాల కొరత తీవ్రంగా ఉంది. ఈ నేపథ్యంలో అనాథ శవాలను మెడికల్ కాలేజీలకు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు డిజిపి మహేందర్‌రెడ్డి తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. సాధారణ మరణమై, ఆ మృతదేహాన్ని తీసుకుపోవడానికి ఎవరూ ముందుకు రాని సందర్భంలో మాత్రమే అన్ని రకాల న్యాయపర ప్రక్రియలు పూర్తి చేసి మృతదేహాలను మెడికల్ కాలేజీకి అప్పగించాలని స్పష్టం చేశారు. వాటికి ఎలాంటి పోస్టుమార్టం నిర్వహించకుండా అప్పగించాలని సూచించారు.

జస్టిస్ అభిషేక్‌రెడ్డి బదిలీని రద్దు చేయాలి

- న్యాయవాదుల నిరసన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జస్టిస్ అభిషేక్ రెడ్డి బదిలీకి సుప్రీంకోర్టుకు ప్రతిపాదన చేయడాన్ని వ్యతిరేకిస్తూ హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ (హెచ్‌సీఏఏ) ఆధ్వర్యంలో న్యాయవాదులు గురువారం విధులు బహిష్కరించారు. బదిలీ ఉత్తర్వుల ప్రతిపాదనను రద్దు చేసే వరకు నిరసన వ్యక్తం చేస్తామన్నారు. మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో వారు విధులు బహిష్కరించి ఆందోళన చేపట్టారు. పెద్ద సంఖ్యలో న్యాయవాదులు పాల్గొన్నారు. హెచ్‌సిఎఎ అధ్యక్షులు వి.రఘునాథ్ మాట్లాడుతూ.. బదిలీ ద్వారా న్యాయ వ్యవస్థ స్వతంత్రతను దెబ్బతీసేలా చేస్తున్నారనీ, ఏకపక్షంగా బదిలీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు కొలీజియం బదిలీ నిర్ణయాన్ని రద్దు చేయాలన్నారు. హైకోర్టులోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని స్థాయి కోర్టుల్లో న్యాయవాదులు విధులకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. జస్టిస్ అభిషేక్‌రెడ్డి బదిలీని ఆపాలంటూ హెచ్‌సీఏఏ ఏకగ్రీవ తీర్మానం చేసిందన్నారు. తర్వాత హైకోర్టు వద్ద రాస్తారోకో చేశారు.

ఐడిఎఫ్‌సి ఎంఎఫ్ నుంచి రెండు కొత్త ఫండ్స్

హైదరాబాద్ : ఐడిఎఫ్‌సి మ్యూచువల్ ఫండ్ కొత్తగా ఓపెన్ ఎండెడ్ టార్గెట్ మెచ్యూరిటీ ఇండెక్స్ ఫండ్ ఐడిఎఫ్‌సి క్రిసిల్ ఐబిఎక్స్ 90:10 ఎస్‌డిఎల్ గిల్ట్ నవంబర్ 2026 ఇండెక్స్ ఫండ్, ఎస్‌డిఎల్ ప్లస్ గిల్ట్ పండ్స్ ఏప్రిల్ 2032 ఇండెక్స్ ఫండ్స్‌ను ఆవిష్కరించినట్లు ప్రకటించింది. నవంబర్ 2032 ఇండెక్స్ ఫండ్ ఎన్ఎఫ్ఓ 14 నవంబర్‌న తెరువబడిందని 28 నవంబర్‌తో ముగియనుందని తెలిపింది. పెట్టుబడులను లైసెన్స్‌డ్ మ్యూచువల్ ఫండ్ డిస్ట్రిబ్యూటర్స్, ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్‌ద్వారా పెట్టుబడులు పెట్టవచ్చని పేర్కొంది.

10% కుప్పకూలిన పేటియం షేర్

హైదరాబాద్ : పేటియం మాతృసంస్థ వన్ 97 కమ్యూనికేషన్ షేర్లు అమ్మకాల తాకిడితో కుప్పకూలాయి. గురువారం ఆ కంపెనీ షేర్ ఏకంగా 10 శాతం పైగా విలువ కోల్పోయింది. పేటియంలోని 4.5 శాతం వాటాకు సమానమయ్యే 2.95 కోట్ల షేర్లను సాఫ్ట్ బ్యాంక్ విక్రయించనున్నట్లు వచ్చిన రిపోర్టులు షేర్ పతనానికి ప్రధాన కారణమయ్యాయి. ఉదయం రూ.562.75 వద్ద ప్రారంభమైన సూచీ ఓ దశలో రూ.535 కనిష్టానికి పడిపోయింది. తుదకు 10.78 శాతం పతనంతో రూ.536.60 వద్ద ముగిసింది. గతేడాది నవంబర్‌లో ఈ కంపెనీ ఐపిఒకు వచ్చిన సమయంలో రూ.1,950 వద్ద లిస్టింగ్ అయ్యింది. ఆ తర్వాత నుంచి వరుసగా పడిపోతూ వస్తోంది. ఈ షేర్లలో పెట్టుబడులు పెట్టిన రిటైల్ ఇన్వెస్టర్లు బోదిబోమంటున్నారు. సెప్టెంబర్ 30 నాటికి పేటియంలో సాఫ్ట్‌బ్యాంక్‌కు 17.5 శాతం వాటా ఉంది.

వివిటి ఎపి వర్సిటీలో అంతర్జాతీయ సదస్సు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వెల్లూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ) ఏపీ విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ సైన్సెస్, ఇండియానా యూనివర్సిటీ పర్డ్యూ, యూనివర్సిటీ ఇండియానా పోలీస్ యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా సంయుక్త ఆధ్వర్యంలో అధునాతన నానో మెటీరియల్స్, అప్లికేషన్స్‌పై మూడురోజులపాటు వర్చువల్‌లో జరిగే అంతర్జాతీయ సదస్సు బుధవారం ప్రారంభమైంది. నానోసైన్స్, టెక్నాలజీ రంగంలో పురోగతిని చర్చించేందుకు విద్యాసంస్థలు, పరిశ్రమల నుంచి అధ్యాపకులు, శాస్త్రవేత్తలు, జాతీయ, అంతర్జాతీయ కమ్యూనిటీలకు చెందిన ఇంజినీర్లను ఒకచోట చేర్చడం ఈ సదస్సు ముఖ్యఉద్దేశాన్ని వీఐటీ ఏపీ వర్సిటీ స్కూల్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ సైన్సెస్ డీన్ శాంతను మండల్, ఐయూపీయూఐ యూఎస్ఏ జనరల్ కో చైర్‌కాన్ఫరెన్స్ మంగీలాల్ గురువారం వివరించారు. ఈ సందర్భంగా సీఎస్ఐఆర్ డైరెక్టర్ డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ నానోటెక్నాలజీలో పురోగతి గురించి తెలుసుకునేందుకు ఇలాంటి సదస్సు దోహదపడుతుందని చెప్పారు. వీఐటీ ఏపీ వర్సిటీ వీసీ ఎస్వీ కోటారెడ్డి మాట్లాడుతూ పరిశోధన, పబ్లికేషన్, పేటెంట్లు, ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్, స్టార్టప్‌లు, పరిశ్రమలతో ఎంఒయులు, ప్లేస్‌మెంట్లు, మౌలిక సదుపాయాలు, ర్యాంకింగ్‌లో సాధించిన విజయాలను వివరించారు. వర్సిటీ రిజిస్ట్రార్ జగదీశ్ సి ముదిగంటి పాల్గొన్నారు.

దళిత బంధు లబ్దిదారుల ఎంపికలో

ప్రజాప్రతినిధుల చేతివాటం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం దళితుల అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన దళితబంధు పథకాన్ని అమ్ముకుంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలోని చింతకాని మండలంలో ముందుగా ఈ పథకాన్ని ప్రారంభించగా.. అ తర్వాత జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఉన్న ఎమ్మెల్యేలకు మరికొన్ని యూనిట్లు కేటాయించిన విషయం అందరికీ తెలిసిందే. మొదటిసారి దళితబంధు కేటాయించినప్పుడు నియోజకవర్గంలో ఒకటి రెండు చోట్ల మినహా ఎక్కువ శాతం ప్రజాప్రతినిధులు, మండల నాయకులు అర్హతలేని వారికి, తమ ముఖ్య అనుచరులకు అమ్ముకున్నారనే విమర్శలు వచ్చాయి.

వైరా నియోజకవర్గానికి ఐదు వందలు దళితబంధు యూనిట్లు మంజూరవ్వగా.. ఎమ్మెల్యే వినూత్నంగా ఆలోచించి రాజకీయాలకతీతంగా నియోజకవర్గంలో ఉన్న అఖిలపక్ష పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులను పిలిపించి తన క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించి ఒక్కొక్క ప్రజాప్రతినిధికి ఒక్కొక్క యూనిట్ కేటాయించారు. మండల స్థాయి ప్రజాప్రతినిధులకు, ముఖ్య నాయకులకు సైతం యూనిట్‌లు కేటాయించడంతో వారు దళితబంధు పథకాన్ని ఫర్ సేల్ అంటూ బహిరంగంగా అమ్మకానికి పెట్టారని నియోజకవర్గంలో చర్చ జోరుగా సాగుతోంది. ఇలా ప్రజాప్రతినిధులకు అడ్డగోలుగా యూనిట్లు కేటాయించడంతో నిజమైన అర్హత కలిగిన దళితులకు అన్యాయం జరుగుతుందని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రజాప్రతినిధులు ఒక్కొక్క యూనిట్ రూ.1.5 లక్ష నుంచి రూ.3 లక్షలకు అమ్ముకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజా ప్రతినిధుల ఇండ్ల చుట్టూ లబ్దిదారులు ప్రదక్షణలు చేస్తుండటంతో లబ్దిదారుల మధ్య పోటీ పెంచి డబ్బులు ఎక్కువగా డిమాండ్ చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎమ్మెల్యే యూనిట్లు కేటాయించిన సమయంలో అర్హత కలిగిన లబ్దిదారులకు మాత్రమే ఇవ్వాలని, ఎవరి దగ్గర డబ్బులు తీసుకోవద్దని గట్టిగా హెచ్చరించి చెప్పినా ఆయన ఆదేశాలను బేఖాతరు చేస్తూ ప్రజాప్రతినిధులు దళితబంధు బహిరంగంగా అమ్ముకుంటూ డబ్బులు పోగేసుకుంటున్నారనే వ్యాఖ్యలు నియోజకవర్గ వ్యాప్తంగా బలంగా వినిపిస్తున్నాయి.



లబ్దిదారులకు పంపిణీ చేసిన కార్లు, ట్రాక్టర్లు

మాతృసంస్థకు రమ్మని హెల్త్ డైరెక్టర్ సర్క్యులర్

- మూడు నెలలైనా అమలు కాని వైనం
- రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీలో కదలని ఎపిడి
- సర్క్యులర్ అమలు కాకపోవడంపై అనుమానాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆ సొసైటీ స్థాపించిన ఉద్దేశం..., లక్ష్యాలేంటో కానీ నిత్యం అధికారుల విచిత్ర నిర్ణయాలపైనే చర్చలు. ఉద్యోగుల్లో అసంతృప్తి. బదిలీలు, నియామకాలు అన్నింటిపైనా వెల్లువెత్తున్న ఆరోపణలు. నిరంతరం వివాదాస్పదంగా మారుతున్న అధికారుల వైఖరి. ఇదంతా రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీకి సంబంధించినవి. గతంలో ఎన్‌జిఒలకు అధిక మొత్తంలో చెల్లింపులు చేశారనే ఆరోపణలు వచ్చాయి. కొన్ని కార్యక్రమాల పేరుతో డబ్బులు వృథా చేశారనీ, వాటితో సాధించిన ఫలితం శూన్యమని విమర్శలు వెల్లువెత్తాయి. నిత్యం ఏదో ఒక వివాదాంశం సొసైటీ ఉద్యోగుల మధ్య జోరుగా చర్చకు దారి తీస్తున్నది. తాజాగా రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు మూడు నెలల క్రితం అంటే ఆగస్టు 18న అన్ని ప్రధాన కార్యాలయాలకు, జాతీయ కార్యక్రమాలకు సంబంధించిన తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జాతీయ ఆరోగ్య మిషన్ పరిధిలోని విభాగాల కార్యాలయాలకు సర్క్యులర్ జారీ చేశారు. ఎవరైతే ఫారీన్ సర్వీస్ డిప్యూటేషన్‌పై కొనసాగుతున్నారో వారంతా తిరిగి తమ తమ మాతృ శాఖలు, విభాగాలను ఏడు రోజుల్లో రిపోర్ట్ చేయాలన్నది ఆ సర్క్యులర్ సారాంశం.

ఈ క్రమంలో అన్ని కార్యాలయాలు, డిపార్ట్‌మెంట్లకు ఇచ్చినట్టుగానే రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీకి సర్క్యులర్ ఇచ్చారు. ఆ సొసైటీలో అదనపు ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఫారీన్ సర్వీస్ డిప్యూటేషన్‌పై కొనసాగుతున్న డాక్టర్ అన్న ప్రసన్న ఏడు రోజులు గడిచినప్పటికీ రిపోర్టు చేయలేదని సమాచారం. మూడు నెలలైనా కూడా ఉలుకుపలుకు లేకపోవడంపై ఉద్యోగులు అనేక అనుమానాలు వ్యక్తం చేశారు. ఇదే విషయంపై సమాచార హక్కు చట్టం కింద కొద్ది మంది రాష్ట్ర వైద్యారోగ్యశాఖ కార్యదర్శి, రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు దీనిపై వివరణ కోరారు. దీంతో ఆ ఇరువురు ఉన్నతాధికారులు రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్‌కు అక్టోబర్ 10న ప్రత్యేకంగా లేఖ రాశారు. ఆ లేఖలో ఎపిడిగా ఇంకా కొనసాగుతున్న డాక్టర్ అన్నప్రసన్నను వెంటనే రిలీవ్ చేయాలని కోరారు. గత నాలుగేండ్ల నుంచి రాష్ట్ర వైద్యారోగ్యశాఖ కార్యదర్శి నుంచి గానీ, రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకుల నుంచి గానీ ఎలాంటి డిప్యూటేషన్, రెన్యువల్, కంటిన్యూయేషన్ కోసం తాము ఉత్తర్వులు ఇవ్వలేదని స్పష్టంగా పేర్కొన్నారు. ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చినప్పటికీ ఇంకా అమలు కాకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. వాటికి ఫుల్‌స్టాప్ పెట్టేందుకు ఇప్పటికైనా ఆ సర్క్యులర్ అమలు చేయాల్సిన అవసరముందని ఉద్యోగులు అభిప్రాయపడుతున్నారు.

ఎఎఫ్‌పిఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రారంభంలోనే రోగాలను గుర్తించగలిగితే సాధారణ చికిత్సతోనే సంపూర్ణ ఆరోగ్యవంతులుగా మారవచ్చని అకాడమీ ఆఫ్ ఫ్యామిలీ ఫిజిషియన్స్ ఆఫ్ ఇండియా (ఎఎఫ్‌పిఐ) డాక్టర్ గిరిజన రమణి తెలిపారు. ఎఎఫ్‌పిఐ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్ మల్లాపూర్‌లోని శ్రీకరి మహాసన హైస్కూల్‌లో నర్సరీ నుంచి ఏడో తరగతి వరకు విద్యార్థులకు ఉచిత వైద్య పరీక్షలను నిర్వహించారు. బరువు, ఎత్తుతోపాటు దంత, కంటి, చెవి, ముక్కు, గొంతు, చర్మానికి సంబంధించిన వ్యాధి నిర్ధారణ పరీక్షలను నిర్వహించారు. దాదాపు పది నుంచి 11 రకాల జబ్బులతో కొంత మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నట్టు గుర్తించారు. చదవడం, రాయడంలో కష్టం, దృష్టి లోపం, అధిక బరువు, ఆహారలోపాలు, విటమిన్లు, పంటి సమస్యలు, బొల్లి సంబంధిత తెల్లమచ్చలు, చర్మ సంబంధిత వ్యాధులు, ఫంగస్ వల్ల సంభవించే పేను కొరుకుడు వ్యాధి, వయసుకి తగ్గ ఎత్తు లేకపోవడం, ఎండోక్రయిన్ వ్యాధులు, విటమిన్ డి లోపం వల్ల వచ్చే రికెట్స్ వ్యాధి, విటమిన్ల లోపం వల్ల ముఖం మీద తెల్లమచ్చలు, ఎండ వల్ల ఏర్పడే తెల్లమచ్చలు, మోకాలికి చీము పట్టి ప్రమాదకరంగా మారడం, ఎముక దెబ్బతినే పరిస్థితి రావడం వ్యాధులు ప్రాథమిక దశలో ఉన్నట్టు గుర్తించారు. ఈ సందర్భంగా ప్రముఖ పీడియాట్రిషియన్ డాక్టర్ నళిని మాట్లాడుతూ మందకొడితనం, రక్తహీనత వల్ల గుండె వేగంగా కొట్టుకోవడాన్ని గుర్తించినట్టు తెలిపారు. ఈ వ్యాధుల చికిత్స గురించి తల్లిదండ్రులతో చర్చించి, అవసరమైతే స్పెషలిస్టు వైద్యం అందేలా చూడటం వల్లే పిల్లల ఆరోగ్యం మెరుగుపడుతుందని సూచించారు. ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసి పిల్లల్లో వ్యాధులను ప్రారంభదశలోనే గుర్తించడం ద్వారా పాఠశాల యాజమాన్యం మంచి నిర్ణయం తీసుకుందని తల్లిదండ్రులు ఆ పాఠశాల చైర్మెన్ ఎన్ సాయిబాబాకు ధన్యవాదాలు తెలిపారు. పరీక్షలు నిర్వహించిన వారిలో ఫ్యామిలీ ఫిజీషియన్లు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ సరిత, డాక్టర్ వర్ధన్, ఎల్ వి ప్రసాద్ నేత్ర వైద్యశాల నుచి జచిన్ బృందంతో పాటు డెంటల్, ఇంప్లాంట్ సర్జన్లు డాక్టర్ వేణు యాదవ్, డాక్టర్ రాజా ఉన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మాల షినాయ్ పర్కాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమోషన్లు మాకివ్వరా?

- డ్రైవర్, కండక్టర్లు అలాగే రిటైర్ కావాలా?
- యాజమాన్యానికి ఎన్ఎమ్‌యు ప్రశ్న

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

ముప్పై ఏండ్లు డ్యూటీ చేసినా డ్రైవర్, కండక్టర్లు అవే ఉద్యోగాల్లో రిటైర్ అవుతున్నారనీ, వారికి ప్రమోషన్లు ఎందుకు ఇవ్వట్లేదని టిఎస్ఆర్‌టిసి నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎమ్‌యు) అధ్యక్షులు పి కమాల్‌రెడ్డి యాజమాన్యాన్ని ప్రశ్నించారు. ఇది కచ్చితంగా వారిపట్ల యాజమాన్యం చూపుతున్న వివక్షే అని గురువారం ఒక పత్రికా ప్రకటనలో విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగుల కంటే ఆర్‌టిసి అధికారులకు చాలా ఎక్కువ జీతాలు ఉన్నాయనీ, వారికి మాత్రం అన్ని విభాగాల్లో పదోన్నతులు లభిస్తున్నాయని తెలిపారు. కానీ సంస్థలోని కార్మికులకు మాత్రమే ప్రభుత్వ ఉద్యోగుల కంటే అతి తక్కువగా జీతాలు ఉన్నాయనీ, 30 ఏండ్లు ఎదురు చూసినా వారికి మాత్రం పదోన్నతులు లభించట్లేదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక దాదాపు 120 మందికిపైగా డిపో మేనేజర్లు, 30 మందికి డివిజనల్ మేనేజర్లు, 20 మందికి రీజనల్ మేనేజర్లు, 10 మందికిపైగా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లుగా అధికారులకు ప్రమోషన్లు ఇచ్చారని వివరించారు. టిఎస్ ఆర్‌టిసి చైర్మన్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, ఎమ్‌డిగా విసి సజ్జనార్ నియమితులయ్యాక గడచిన ఏడాది కాలంలో మరికొందరు అధికారులకు ప్రమోషన్లు ఇచ్చారని ప్రస్తావించారు. క్లాస్-2 సూపర్‌వైజర్ల నుంచి క్లాస్ -1 అధికారుల వరకు ఖాళీ ఏర్పడగానే పదోన్నతులతో వెంటనే భర్తీ చేస్తున్నారనీ, కానీ డ్రైవర్, కండక్టర్లు అదే పోస్టులో రిటైర్ అవుతున్నారని తెలిపారు. దీనిపై యాజమాన్యం తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సంస్థ చైర్మెన్, ఎమ్‌డీలకు లేఖలు రాస్తున్నామని చెప్పారు.

'ధరణి' పాపాల పుట్ట

- తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ విమర్శ

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

రెవెన్యూ సంస్కరణల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'ధరణి' పాపాల పుట్టగా మారిందని తెలంగాన రియల్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నారగోని ప్రవీణ్‌కుమార్ విమర్శించారు. ఈ మేరకు గురువారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ధరణి వల్ల తొమ్మిది లక్షల మంది రైతులు సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఎవరి ప్రయోజనాల కోసం సాదాబైనామాలు రద్దు చేసిందని ప్రశ్నించారు. సరిహద్దులు లేకుండా ధరణిలో భూమిని నమోదు చేస్తున్నారని తెలిపారు. ధరణి వచ్చాక ఎన్ని లక్షల ఎకరాల భూమి ఎవరెవరి పేర్లమీదికి మారిందో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు, వారి కుటుంబ సభ్యుల పేర్ల మీదకు లక్షల ఎకరాల భూమి బదిలీ చేయబడిందని ఆరోపించారు.

బహుజన యోధుల చరిత్రకు

స్వరాష్ట్రంలో వెలుగులు

తెలంగాణ సాహిత్య అకాడమి చైర్మెన్ జూలూరు గౌరీశంకర్



సదస్సులో మాట్లాడుతున్న జూలూరు గౌరీశంకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బహుజన యోధుల గాథలను, విస్తృత బహుజన సాహితీ కళలు, గళాల చరిత్రను వెలుగులోకి తీసుకొచ్చేందుకు కృషి కొనసాగుతోందని తెలంగాణ సాహిత్య అకాడమి చైర్మెన్ జూలూరు గౌరీశంకర్ అన్నారు. సిఎం కెసిఆర్ దార్శనిక ఆలోచనలతో విస్తృత సాహిత్యాన్ని వెలుగులోకి తెచ్చే పని తెలంగాణ రాష్ట్ర అవతరణ నుంచి ముమ్మరంగా కొనసాగుతోందని తెలిపారు. రాష్ట్రంలో 85 శాతం ఉన్న బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ, ఆదివాసీ అస్తిత్వ వాదాల సాహిత్యం వెలుగులోకి వస్తేనే అది సమగ్ర తెలుగు సాహిత్య చరిత్రగా రూపొందుతుందన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల రజతోత్సవాల సందర్భంగా గురువారం జరిగిన 'బహుజన స్ఫూర్తి ప్రధాతలు' జాతీయ సదస్సును జూలూరు గౌరీశంకర్ ప్రారంభించి మాట్లాడారు. ఒకటో తరగతి నుంచి డిగ్రీ వరకు పాఠ్య పుస్తకాల్లో విస్తృతంగా బహుజన యోధుల చరిత్రలను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఇలాంటి చారిత్రకమైన పనికి తెలంగాణ ప్రభుత్వం సాహిత్య పరిశోధన తలుపులు తెరిచిందన్నారు. దేశాన్ని కమ్ముకొస్తున్న కుల, మత ఉన్మాదాలకు వ్యతిరేకంగా యువతరం పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు. విభిన్నత్వంతో కలిసి ఉన్న దేశాన్ని కులం, మతాలతో ముక్కలుగా విభజిస్తే దేశం అధోగతి పాలవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో 50 శాతానికి మించి ఉన్న బహుజనుల కుల గణన చేయమంటే కేంద్ర ప్రభుత్వం తిరస్కార ధోరణితో వ్యవహరిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముస్లింలకు 12 శాతం, గిరిజనులకు పది శాతం రిజర్వేషన్లు పెంచాలని కేంద్రాన్ని కోరుతూ అసెంబ్లీ తీర్మానం చేసి పంపినా నిర్లక్ష్యంతో పెడచెవిన పెట్టిందని తెలిపారు. తెలుగు సాహిత్యంలో స్త్రీవాద, దళిత, బిసి, మైనార్టీ, ఆదివాసీ, గిరిజన సాహిత్య వాదాలను జూలూరు తన ప్రసంగంలో రేఖామాత్రంగా విశ్లేషించారు. ఈ జాతీయ సదస్సుకు కళాశాల ప్రిన్సిపల్ డా ఎ శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించగా సదస్సు లక్ష్యాలను ప్రొ వెల్దండి శ్రీధర్ వివరించారు. ప్రముఖ తెలంగాణ సాహిత్య విమర్శకులు సంగిశెట్టి శ్రీనివాస్ కీలకోపన్యాసం చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యక్షులు ప్రొ॥డి కాశీం బహుజన స్ఫూర్తి ప్రధాతలపై సవివరంగా విశ్లేషించారు. సదస్సులో లెఫ్టినెంట్ ఎం భవానీ, కళాశాల అకాడమిక్ సంచాలకులు మాచర్ల బాలరాజు, ఎల్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.



ఎంపిటిసి బుచ్చమ్మ కుటుంబాన్ని అడ్డుకుంటున్న రెవెన్యూ సిబ్బంది

భూమి అక్రమించారని.. టిఆర్ఎస్ ఎంపిటిసి కుటుంబ సభ్యుల ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఓ వ్యక్తి తమ భూమిని ఆక్రమించారని సూర్యాపేట జిల్లా ఐలాపురం ఎంపిటిసి ధరావత్ బుచ్చమ్మ కుటుంబసభ్యులు గురువారం చివ్వెంల తహసీల్దార్ కార్యాలయం ఎదుట పురుగులమందు డబ్బా, పెట్రోల్ బాటిల్‌తో ఆత్మహత్యాయత్నం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. ఐలాపురం గ్రామ టిఆర్ఎస్ ఎంపిటిసి ధరవాత్ బుచ్చమ్మ కుమారుడు ధరావత్ హరిసింగ్ ఐలాపురం శివారులోని సర్వే నెంబర్ 166లో ధరావత్ వెంకన్న దగ్గర 21 గుంటల భూమిని కొనుగోలు చేశాడు. ధరావత్ హరిసింగ్ కొనుగోలు చేసిన భూమిని గాంధీనగర్‌కు చెందిన రఫీ అనే వ్యక్తి ఆక్రమించుకొని దౌర్జన్యంగా భూమిలో హద్దురాళ్లు పాతి, ఎంపిటిసి కుటుంబ సభ్యులను బెదిరింపులకు గురి చేస్తున్నాడు. ఈ విషయంపై చివ్వెంల తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా లాభం లేకుండా పోయింది. అధికార పార్టీకి చెందిన నాయకుల ఒత్తిడి కారణంగా అధికారులు పట్టించుకుంటలేరని ఎంపిటిసి ధరావత్ బుచ్చమ్మ కుటుంబ సభ్యులు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి పురుగుల మందు తాగి, పెట్రోల్ ఒంటిపై పోసుకొని ఆత్మహత్యాయత్నం చేశారు. స్పందించిన రెవిన్యూ సిబ్బంది వారిని రక్షించి ఆస్పత్రికి తరలించారు. తమకు న్యాయం చేయకపోతే కుంటుంబం అంతకలిసి ఆత్మహత్య చేసుకుంటామని ఆవేదన వ్యక్తంచేశారు.. స్థానిక పోలీసులను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న ఆర్‌యుపిపి నేతలు

భాషాపండితులకు త్వరలో తీపికబురు

- ఆ పోస్టుల అప్‌గ్రేడ్‌కున్న అడ్డంకులు తొలగిస్తాం
- ఆర్‌యుపిపి నేతలకు మంత్రి సబిత హామీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని భాషాపండితుల పోస్టులను అప్‌గ్రేడ్ చేసేందుకు ఉన్న అడ్డంకులను తొలగించి త్వరలోనే వారికి తీపికబురు అందిస్తామని విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. గురువారం హైదరాబాద్‌లో మంత్రిని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్తు (ఆర్‌యుపిపి) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు సి జగదీశ్, ప్రధాన కార్యదర్శి ఎస్ నర్సిములు కలిసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో దశాబ్దాలుగా భాషా పండితులు ఎదురుచూస్తున్న గ్రేడ్-2 పోస్టుల అప్‌గ్రెడేషన్ కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో సర్వీసు రూల్స్ 2, 3 ఇచ్చిందని వారు ఈ సందర్భంగా తెలిపారు. ఆ తర్వాత 110 జిఒను ఇచ్చి మరింత దూకుడు పెంచిందని పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భాషా బోధకులను అందించేందుకు ప్రయత్నిస్తున్నట్టు మంత్రి సబిత వివరించారని తెలిపారు. ప్రపంచ తెలుగు మహాసభల్లో సాక్షాత్తు సిఎం కెసిఆర్ ఇచ్చిన మాటకు అనుగుణంగా రాష్ట్రంలో భాషా పండితుల పోస్టులను అప్‌గ్రేడ్ చేస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఈ అంశాన్ని మరోసారి సిఎం దృష్టికి తీసుకెళ్తామన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌యుపిపిటిఎస్ హైదరాబాద్ జిల్లా బాధ్యులు నర్సింగ్ పాల్గొన్నారు.

విద్యావిహార్ పాఠశాలలో నూతన క్రీడా మైదానం

- ప్రారంభించిన దక్షిణ మధ్య రైల్వే జిఎం అరుణ్‌కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యావిహార్ ఉన్నత పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన క్రీడా మైదానాన్ని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ గురువారం సికింద్రాబాద్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణ మధ్య రైల్వే మహిళా సంక్షేమ సంఘం సభ్యులు విద్యార్థులకు అత్యుత్తమ క్రీడా సౌకర్యాలను కల్పించిందని చెప్పారు. టెన్నిస్, వాలీబాల్, రన్నింగ్ ట్రాక్, కబడ్డీ, ఖో-ఖో క్రీడలకు సంబందించి అన్ని ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. అనంతరం పాఠశాల విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ జెకె జైన్, ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ రాజీవ్ కిషోర్, రాజారామ్, ఉషా జైన్, ఇతర రైల్వే అధికారులు, సభ్యులు పాల్గొన్నారు.

సూపర్‌న్యూమరీ పోస్టులు ఏర్పాటు చేయండి

- సిఎం కెసిఆర్‌కు టివిఇఎ లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సుప్రీంకోర్టు ఆదేశాల అమల్లో భాగంగా విద్యుత్ సంస్థల్లో ఇప్పటికే పదోన్నతులు పొందిన తెలంగాణ ఉద్యోగులకు అన్యాయం జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలంగాణ విద్యుత్ ఇంజినీర్స్ అసోసియేషన్ సీఎం కేసీఆర్‌కు లేఖ రాసింది. సుప్రీం కోర్టు ఆదేశాల అమలు పేరుతో ఇచ్చిన రిజర్వేషన్లు, ప్రమోషన్లను రద్దు చేస్తారనే ప్రచారం జరుగుతున్నదనీ, అలా జరక్కుండా అదనపు పోస్టులు, సూపర్‌న్యూమరీ పోస్టుల్ని క్రియేట్ చేయాలని ఆ లేఖలో సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎమ్ నెహ్రూ, ఎన్ భాస్కర్ విజ్ఞప్తి చేశారు.

నేటి నుంచి
టిఎండబ్ల్యుఇయు నాలుగో మహాసభ

- వెయ్యి స్తంభాల గుడి నుంచి పబ్లిక్ గార్డెన్ వరకు ప్రదర్శన
- హన్మకొండలో ప్రతినిధుల సభ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ (టిఎండబ్ల్యుఇయు) నాలుగో మహాసభ హన్మకొండలో శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇవి రెండు రోజుల పాటు కొనసాగుతాయి. ఈ నేపథ్యంలో హన్మకొండ చౌరస్తా, మహాసభల ప్రాంగణాన్ని ఎర్రతోరణాలతో అలంకరించారు. శుక్రవారం ఉదయం 11:00 గంటలకు నగరంలోని వెయ్యి స్తంభాల గుడి దగ్గర నుంచి పబ్లిక్ గార్డెన్ వరకు రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే వేల మంది మున్సిపల్ కార్మికులు భారీ ప్రదర్శన చేపట్టనున్నారు. ప్రత్యేకంగా మూడు వేల మంది మహిళా కార్మికులు ఎర్రచీరలతో ప్రదర్శనలో పాల్గొనబోతున్నారు. బహిరంగ సభలో ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, సిఐటియు జాతీయ ఉపాధ్యక్షులు ఎం సాయిబాబు, తెలంగాణ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, వర్కింగ్ ప్రెసిడెంట్ జనగాం రాజమల్లు, జిహెచ్ఎంసి ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు జ .వెంకటేశ్, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఎస్‌వి రమ, టిఎండబ్ల్యుఇయు మహిళా విభాగం రాష్ట్ర కన్వీనర్ వి నాగమణి, రాష్ట్ర కార్యదర్శులు జున్ను ప్రకాశ్, పి సుధాకర్, సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, జిడబ్ల్యుఎంసి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొననున్నారు. అనంతరం పబ్లిక్ గార్డెన్‌లో బహిరంగ సభ నిర్వహించనున్నారు.



మహాసభ ఏర్పాట్లు పరిశీలిస్తున్న టిఎండబ్ల్యుఇయు నాయకులు

మహాసభ అనంతరం హన్మకొండ చౌరస్తాలోని అమృత ఫంక్షన్‌హాల్ (కామ్రేడ్ కందుకూరి లాలునగర్)లో ప్రతినిధుల సభ ప్రారంభమవుతుంది. ఈ మహాసభల్లో భవిష్యత్ పోరాటాలకు సంబంధించిన కార్యాచరణ రూపొందించుకోనున్నారు. ఉద్యోగులందరికీ పిఆర్‌సి వర్తింపజేసిన రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల విషయంలో మాత్రం అన్యాయం చేసింది. పిఆర్‌సి చైర్మెన్ బిస్వాల్ సిఫారసుల ప్రకారం కేటగిరీల వారీగా వేతనాలు పెంచాల్సి ఉండగా వీరి విషయంలో తొక్కిపెట్టింది. కమిటీ సూచనలకు విరుద్ధంగా గుండుగుత్తగా రూ.15,600 వేతనాన్ని నిర్ణయించింది. ఈ విషయంపై మున్సిపల్ కార్మికులు కొట్లాడుతూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వంపై మరింత ఒత్తిడి పెంచి వేతనాలు పెంచుకోవడం ఎలా అనే దానిపై ప్రధానంగా చర్చించే అవకాశం ఉంది. ఎనిమిది గంటల పనివిధానం, రాత్రిపూట పనిచేసే కార్మికుల రక్షణకు ప్రత్యేక చర్యలు, వారాంతపు సెలవు, పండుగలకు వేతనంతో కూడిన సెలవుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎలా కొట్లాడి విజయం సాధించాలనే దానిపై ప్రధానంగా చర్చించనున్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లోని కార్మికులకు కనీస వేతనం రూ.24 వేలు ఇవ్వాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. దీనిపై మహాసభ దృష్టిసారించనుంది. అదే సమయంలో రాంకీ లాంటి ప్రయివేటు సంస్థలకు చెత్త సేకరణ ఒప్పందాలను కట్టబెట్టి కార్మికుల పొట్టగొడుతున్న పాలకుల విధానాలను ఎలా అడ్డుకోవాలనే దానిపైనా చర్చించే అవకాశముంది. మున్సిపల్ కార్మికుల ఉద్యోగాలను పర్మినెంట్ చేసి ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు అందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కట్టివ్వాలనీ, మున్సిపల్ కార్మికులు నూటికి 90 శాతానికిపైగా షెడ్యూల్డ్ తరగతుల వారే ఉన్నారు కాబట్టి వారందరికీ దళిత బంధు వర్తింపజేయాలని మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తోంది. దీనిపై మహాసభలో ప్రత్యేకంగా చర్చించనున్నారు.

మూత్రపిండాల్లోని 10 కిలోల కణితి తొలగింపు

- ఎఐఎన్‌యు వైద్యుల వెల్లడి

హైదరాబాద్ : ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నెఫ్రాలజీ అండ్ యూరాలజీ (ఎఐఎన్‌యు) వైద్యులు మూత్రపిండాల్లో 10 కిలోల బరువున్న 'ఫుట్ బాల్ సైజు' కణితిని విజయవంతంగా తొలగించారు. ఈ తరహా శస్త్రచికిత్స తెలుగు రాష్ట్రాల్లోనే మొట్టమొదటిదని, దేశంలో రెండోదని ఆ వైద్యుల బృందం తెలిపింది. డాక్టర్ మల్లికార్జున నేతృత్వంలో డాక్టర్ తైఫ్ బెండిగెరి, డాక్టర్ కె.రాజేష్ రెడ్డిలతో కూడిన యూరాలజిస్టుల బృందం ఈ సంక్లిష్టమైన ప్రక్రియను విజయవంతంగా నిర్వహించింది. "కడపకు చెందిన 53 ఏళ్ల వ్యక్తి పొత్తికడుపులో వాపు ఉండటంతో వాపుతో ఆయనను ఎఐఎన్‌యుకు తరలించారు. పరీక్షించిన తరువాత పొత్తికడుపులో ఏదో పెద్ద కణితి, గాయం ఉన్నట్లు వైద్యులు కనుగొన్నారు. ఎడమ మూత్రపిండాల నుంచి ఆ కణితి వచ్చినట్లు గుర్తించారు. ఆ కణితి ఎంత పెద్దదంటే, అది పొత్తికడుపు కుహరంలో మూడింట రెండు వంతుల భాగాన్ని ఆక్రమించింది. దీనివల్ల పేగులు కుడి దిగువ భాగంలోకి వెళ్లిపోయాయి." అని డాక్టర్ మల్లికార్జున తెలిపారు. "కణితి పరిమాణం దష్ట్యా, రోబోటిక్ ప్రక్రియ వద్దని నిర్ణయించుకున్నాం. దానికి బదులుగా ఓపెన్ శస్త్రచికిత్సను ఎంచుకున్నాం. చాలా కష్టపడిన తర్వాత కణితిని విజయవంతంగా తొలగించగలిగాం. శస్త్రచికిత్స అనంతరం, కణితి ఏకంగా ఫుట్ బాల్ పరిమాణంలో చాలా పెద్దదిగా ఉందని తెలిసింది. మైక్రోస్కోపిక్ పరీక్ష ద్వారా, ఇది క్యాన్సర్ (రీనల్ సెల్ కార్సినోమా) అని ఖరారైంది" అని తెలిపారు.



వైద్యులు తొలగించిన కణితి

27న టిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర మహాసభ

- సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు
- జయప్రదం చేయాలంటూ పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఈనెల 27న హైదరాబాద్‌లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (టిడబ్ల్యుజెఎఫ్) రాష్ట్ర ద్వితీయ మహాసభ నిర్వహిస్తున్నట్టు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిడి సోమయ్య, బి బసవపున్నయ్య తెలిపారు. 27న ఉదయం పది గంటలకు జర్నలిస్టుల మహా ప్రదర్శన జరుగుతుందనీ, అన్ని జిల్లాల నుంచి జర్నలిస్టులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని వారు కోరారు. గురువారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఫెడరేషన్ రాష్ట్రస్థాయి ప్రత్యేక సమావేశంలో వారు మాట్లాడుతూ... జర్నలిస్టుల సమస్యలపై టిడబ్ల్యుజెఎఫ్ నిరంతరం పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. రాష్ట్రంలో మొదటి ట్రేడ్ యూనియన్‌గా ఫెడరేషన్ ఏర్పడిందనీ, అన్ని విషయాల్లో జర్నలిస్టులకు అండగా నిలుస్తోందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో మహాసభలు నిర్వహించి సంఘ నిర్మాణాన్ని బలోపేతం చేశామని చెప్పారు. 27న హైదరాబాద్ బాగ్ లింగంపల్లిలోని ఆర్‌టిసి కళాభవన్‌లో ఫెడరేషన్ రాష్ట్ర ద్వితీయ మహాసభల నిర్వహణకు సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. మహాసభలో పలువురు రాష్ట్ర మంత్రులు, ఎంపి, ఎమ్మెల్యేలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, పలువురు ఎడిటర్లు పాల్గొంటారని తెలిపారు. జర్నలిస్టుల సమస్యలపై మహాసభలో చర్చించి భవిష్యత్తు కార్యాచరణను రూపొందిస్తామన్నారు.

నకిలీ గన్ లైసెన్స్ ముఠా గుట్టురట్టు

- ఏడుగురు నిందితుల అరెస్టు
- 34 తుపాకులు, 140 రౌండ్స్, 34 నకిలీ పత్రాలు స్వాధీనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆల్‌ఇండియా పర్మిట్‌తో నకిలీ గన్ లైసెన్స్ తయారు చేసి, వాటి ద్వారా అసలైన తుపాకులను సమకూర్చి ఇతర రాష్ట్రాలకు చెందిన నిరుద్యోగ యువతను ఉద్యోగాల పేరుతో మోసం చేస్తున్న ఘరానా ముఠాలోని ఏడుగురిని వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 34 తుపాకులు, 140 రౌండ్స్, 34 నకిలీ గన్ లైసెన్స్ వాటికి సంబంధించిన వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లోని ఐసిసిలో గురువారం డిసిపి రాధాకిషన్ రావుతో కలిసి సిపి సివి ఆనంద్ మీడియాకు వివరాలు వెల్లడించారు. జమ్ము కాశ్మీర్‌లోని రాజోరి జిల్లాకు చెందిన అల్తాఫ్ హుస్సేన్ 2013లో జీవనోపాధి కోసం హైదరాబాద్‌కు వచ్చి వెస్ట్ మారేడ్‌పల్లిలోని గ్రేస్ మేనేజ్‌మెంట్ సెక్యూరిటీ సర్వీస్‌లో పనిలో చేరాడు. అనంతరం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఎస్‌ఐఎస్ క్యాష్ మేనేజ్‌మెంట్ సర్వీస్‌స్‌లో గన్‌మెన్‌గా విధుల్లో చేరాడు. ఈ సమయంలోనే తన స్వస్థలం రాజోరీకి వెళ్లి అక్కడ మేజిస్ట్రేట్ కార్యాలయంలో కొందరికి లంచాలిచ్చి నకిలీ గన్ లైసెన్స్‌ను సంపాదించాడు. ఆ లైసెన్స్‌తోనే అసలైన తుపాకీ తీసుకొని తిరిగి నగరానికి వచ్చాడు. ఆ నకిలీ లైసెన్స్‌ను ఎవరూ గుర్తించలేదు. దాంతో తానే స్వయంగా నకిలీ ఆయుధ లైసెన్స్‌లు తయారు చేయడం ప్రారంభించాడు. ఇందులో భాగంగా సికింద్రాబాద్‌కు చెందిన హఫీజుద్దీన్ అనే ఒక స్టాంప్ వెండర్‌ను తన మోసాల్లో భాగస్వామిని చేసుకుని నకిలీ స్టాంప్‌లు, ప్రభుత్వ కార్యాలయాల సీల్ తయారు చేశారు. అలాగే గ్రేస్ సెక్యూరిటీ సర్వీసెస్, రిజినల్ మేనేజర్ వెంకట కొండారెడ్డి, వెస్ట్‌మారేడ్‌పల్లిలో ఉన్న జిరాక్స్ షాప్ యజమాని ఐ శ్రీనివాస్‌తో కలిపి ఒక ముఠాగా ఏర్పడ్డారు. సెక్యూరిటీ గార్డులుగా పనిచేయాలనుకునే జమ్మూ కశ్మీర్‌కు చెందిన యువకులను హైదరాబాద్‌కు తీసుకొచ్చి నకిలీ స్టాంప్‌లను ఉపయోగించి వారికి నకిలీ ఆయుధాల సర్టిఫికేట్‌ను ఆల్ ఇండియా పర్మిట్‌తో అందించి రూ. 20 వేల నుంచి రూ. 60 వేల వరకు వసూలు చేసేవారు. ఆ లైసెన్స్‌లు తీసుకొని మహారాష్ట్రలోని పుణే, నాగాపూర్‌కు వెళ్లి అక్కడ ఆయుధాలు విక్రయించే దుకాణాల్లో అసలైన ఆయుధాలు కొనుగోలు చేస్తున్నారు. అలా కొనుగోలు చేసిన ఆయుధాలతో తిరిగి హైదరాబాద్‌కు వచ్చిన వారికి ఏషియన్ సెక్యూరిటీ సర్వీసెస్, నందమూరి సెక్యూరిటీ అండ్ సర్వీసెస్, గ్రేస్ మేనేజ్‌మెంట్ సెక్యూరిటీ సర్వీసెస్‌ల్లో సెక్యూరిటీ గార్డులుగా నియమించుకుంటున్నారు. వారిని వివిఐపి, జ్యువెలరీ షోరూమ్స్, ఎటిఎం, వ్యక్తిగత సెక్యూరిటీగా నియమించుకుంటున్నారు.



మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న సిపి ఆనంద్

నాలుగేళ్లుగా దందా

దాదాపు నాలుగేళ్లుగా ఈ దందా సాగుతోంది. వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులకు వచ్చిన సమాచారంతో టాస్క్‌ఫోర్స్ డిసిపి (ఒఎస్‌డి) రాధకిషన్‌రావు ఆధ్వర్యంలో ఈ లైసెన్స్‌ల వ్యవహారంపై రహస్యంగా విచారణ జరిపారు. జమ్మూ కశ్మీర్‌లో రాజోరి జిల్లా మేజిస్ట్రేట్ కార్యాలయం పేరుతో జారీ అయిన నకిలీ సర్టిఫికెట్లపై అక్కడ కార్యాలయంలో ఆరా తీయడంతో, అవన్నీ నకిలీవని అక్కడి అధికారులు తేల్చారు. దాంతో ఈ నకిలీ వ్యవహారంలో సూత్రధారులు, పాత్రధారులైన అల్తాఫ్ ఉస్సేన్, హఫీజుద్దీన్, వెంకట కొండారెడ్డి, శ్రీనివాస్‌తో పాటు నియామకాలు జరుపుకుంటున్న మూడు సెక్యూరిటీ ఏజెన్సీల నిర్వాహకులను అరెస్ట్ చేసి వారి వద్దనున్న గన్నులు, నకిలీ డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. ఇలాంటి నకిలీ లైసెన్స్‌లో తుపాకులను కలిగి ఉండటం ప్రజా భద్రతకు ముప్పని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ముఠా గుట్టును రట్టుచేయడంలో కీలకంగా వ్యవహరించిన వెస్ట్‌జోన్ ఇన్స్‌పెక్టర్ ఖలీల్ పాష్, ఎస్‌ఐలు రంజిత్‌కుమార్, మల్లిఖార్జున్, ఎండీ ముజఫర్ అలీ, చంద్రమౌళి తదితర సిబ్బందిని సీపీ ప్రత్యేకంగా అభినందించారు.



పెట్రో, డీజిల్ ధరలు తగ్గించాలని ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్, డీజిల్, పెట్రోల్ ధరలను వెంటనే తగ్గించాలని సిపిఎం వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కాశిబుగ్గ చౌరస్తా నుంచి పోచమ్మ మైదాన్ వరకు గ్యాస్ సిలిండర్లతో, ఆటోను తాళ్లతో లాగుతూ వినూత్నంగా భారీ ర్యాలీ నిర్వహించి రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా సభ్యులు అక్కెనపల్లి యాదగిరి మాట్లాడారు. పెరిగిన ధరలతో పేద, మధ్యతరగతి ప్రజలపై మోయలేని భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నెలకు వచ్చే ఆదాయం కుటుంబ అవసరాలకే ఇబ్బందిగా మారిన తరుణంలో ప్రజలు విద్యా, వైద్యానికి ఎలా ఖర్చు చేస్తారని ప్రశ్నించారు. ఎన్నికల ముందు అనేక వాగ్దానాలు చేసి అధికారంలోకొచ్చిన బిజెపి ప్రభుత్వం ఇప్పుడు ప్రజల సంక్షేమాన్ని గాలికి వదిలేసి, వారిపై మోయలేని భారం మోపుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెరిగిన ధరల ప్రభావం నిత్యవసర సరుకులపై పడుతుందన్నారు. ధరలు పెంచి సామాన్య ప్రజల నుంచి సంపాదను కొల్లగొట్టి ప్రభుత్వ ఆదాయాన్ని కార్పొరేట్ కంపెనీలకు, పెట్టుబడిదారులకు దోచిపెడుతున్నారని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం పెంచిన ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. లేకుంటే పార్టీ ఆధ్వర్యంలో ప్రజలందరినీ సమీకరించి ధరలు తగ్గించే వరకు పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వంగరి రవీందర్, దయ్యాల లక్ష్మి, డిష్ రాజు, జన్ను సలీం, చిట్టి, సుబ్బు, సుస్మిత, చిరంజీవి, రంజిత్, అశోక్, సురేష్, ఎస్ కే పాషా, ప్రవీణ్, అనిత, ప్రసంగి, కంది రవి, మల్లికార్జున్, నగేష్, శైలజ, నవీన్ కుమార్, సదయ్య, అడ్లూరి బ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.



సంపద సృష్టికర్తలు కార్మికులే..

- సమస్యల పోరాటాలకు సిద్ధం కండి
- సిఐటియు జాతీయ ఉపాధ్యక్షులు సాయిబాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంపద సృష్టికర్తలు కార్మికులేనని, కార్పొరేట్ అనుకూల విధానాలు అనుసరిస్తోన్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, సామాన్య ప్రజానీకాన్ని కలుపుకొని సమరశీల ఉద్యమాలకు సిద్ధం కావాలని సిఐటియు జాతీయ ఉపాధ్యక్షులు ఎం.సాయిబాబు పిలుపునిచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సిఐటియు మూడో మహాసభ భద్రాచలం పట్టణంలోని సమ్మక్క-సారక్క ఫంక్షన్ హాల్లో (సున్నం రాజయ్య నగర్, చల్లా వెంకన్న ప్రాంగణంలో) జరిగింది. ఈ సభలో ఆయన పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక హక్కులపై దాడి తీవ్రం చేసిందని, అదే స్థాయిలో కార్మికవర్గం ప్రతిఘటనోద్యమాలు పెరుగుతున్నాయని తెలిపారు. బిజెపి ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యవస్థను, రాజ్యాంగబద్ధ సంస్థలను నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సాగుతున్న అన్ని పోరాటాలను సమన్వయపరిచి సంఘటితం చేయాలని అన్నారు. మహాసభకు సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎజె రమేష్, ఆహ్వాన సంఘం చీఫ్ పాట్రిన్, ప్రముఖ వ్యాపారవేత్త దేశప్ప, బాధ్యులు ఎంబి నర్సారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బిసి గురుకులాల పనివేళల మార్పుపై మంత్రి అంగీకారం

- గంగులతో చర్చించిన ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, టిఎస్‌యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహాత్మా జోతిరావు పూలే తెలంగాణ బిసి సంక్షేమ గురుకుల విద్యాసంస్థల పనివేళలను ఇతర సంక్షేమ గురుకుల విద్యాసంస్థలతో సమానంగా ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు మార్చేందుకు బిసి సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అంగీకరించారు. గురువారం హైదరాబాద్‌లో మంత్రిని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ఆధ్వర్యంలో టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె జంగయ్య, చావ రవి కలిసి పనివేళల మార్పు, దసరా సెలవుల్లో అతిథి ఉపాధ్యాయుల (గెస్ట్ టీచర్ల) వేతనాల్లో కోత వంటి అంశాలపై చర్చించారు. పాఠశాలల్లో పిల్లలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ఉపాధ్యాయుల ఆందోళనను మంత్రి దృష్టికి వారు తీసుకొచ్చారు. ఈ అంశాలపై ఆయన సానుకూలంగా స్పందిస్తూ అన్ని సంక్షేమ గురుకులాల్లో విద్యార్థులకు ఒకే రకమైన సదుపాయాలు, ఉపాధ్యాయులకు ఒకే విధమైన వేతనాలు అమలు చేస్తున్నామనీ, పాఠశాలల పనివేళలూ ఒకే విధంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. అతిథి ఉపాధ్యాయులూ తెలంగాణ బిడ్డలే కనుక మానవతా దృక్పథంతో దసరా సెలవుల పేరుతో కోత విధించిన వేతనం తిరిగి చెల్లించే ఏర్పాటు చేస్తామంటూ హామీ ఇచ్చారు. బిసి సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లోని సమస్యల పట్ల సానుకూలంగా స్పందించిన మంత్రి కమలాకర్‌కు నర్సిరెడ్డి, జంగయ్య, చావ రవి కృతజ్ఞతలు తెలిపారు.



సంచార జాతుల సంక్షేమానికి కృషి చేయాలి

- సంచార జాతుల జాతీయ కమిషన్ సభ్యులు తుర్క నరసింహ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంచార జాతుల సంక్షేమానికి కృషి చేయాలని సంచార జాతుల జాతీయ కమిషన్ సభ్యులు తుర్క నరసింహ అన్నారు. గురువారం వరంగల్ జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి గోపి ఆదేశాల మేరకు జిల్లా అదనపు కలెక్టర్ శ్రీవత్స కోట, సంచార జాతుల జాతీయ కమిషన్ సభ్యులు తుర్క నరసింహ, ప్రముఖ కవి రామ చంద్రమౌళి ఆధ్వర్యంలో ప్రముఖుల చిత్ర పటాలకు పూల మాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి సమీక్షను ప్రారంభించారు. జెడ్‌పి, కస్తూర్బా, మోడల్ స్కూల్ అధ్యాపకులు దాదాపు 130మంది ఉపాధ్యాయులతో సబ్జెక్ట్ వారీగా సమీక్షించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు సంచార జాతి ప్రజల ప్రతి ఇంటికి చేరేలా చొరవ చూపాలన్నారు. విద్యార్థులకు విద్యా బోధన పట్ల తమ కలల ద్వారా శాస్త్రీయ విజ్ఞానాన్ని ముందు తరాలకు అందించడంలో ముఖ్యపాత్ర పోషించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రభుత్వాలు వివిధ సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి సంచార జాతుల అభివృద్ధికి కృషి చేయాలని తెలిపారు. జిల్లాలో వారి నివాసాలు గుర్తించి అన్ని రకాల సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఎస్‌సి, ఎస్‌టి, బిసి సంక్షేమ శాఖల అధికారులను ఆదేశించారు. వారి ప్రాంతాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని డిఎంహెచ్ఒ వెంకటరమణకు సూచించారు.

జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించేలా చూడాలని డిఇఒ వాసంతికి సూచించారు. సబ్జెక్ట్‌ల వారీగా ఉపాధ్యాయులను ప్రాథమిక భావాలపై అవగాహన, పునశ్చరణ చేస్తూ ఆసక్తిని రేకెత్తించాలన్నారు. చారిత్రక అంశాలు ప్రాచీన కాలం నుంచి ఆధునిక కాలం వరకు తెలిసేలా చేయాలని అన్నారు. శాస్త్రీయతతోపాటు తెలంగాణ సాహిత్యాన్ని అలవర్చాలని సూచించారు. సమావేశంలో ట్రైబల్ వెల్ఫేర్ డిడి జహీరుద్దున్, జిల్లా వెనుకబడిన కులాల సంక్షేమ శాఖ అధికారి శంకర్ నాయక్, కంది శ్రీనివాస్ రెడ్డి, సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేశంలో అత్యంత ధనిక పార్టీ బిజెపి

- అధికారంలోకి వచ్చేందుకు ఎమ్మెల్యేల కొనుగోలు
- అధికార దుర్వినియోగానికి పాల్పడుతోంది
- దామాషా పద్ధతిలో ఎన్నికలను నిర్వహించాలి
- సిపిఐ ప్రధాన కార్యదర్శి డి రాజా డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో అత్యంత ధనిక పార్టీ బిజెపియేనని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి రాజా అన్నారు. అధికారంలోకి వచ్చేందుకు ఆ పార్టీ విపరీతమైన డబ్బులను వెదజల్లుతున్నదనీ, ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తోందనీ, అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందనీ విమర్శించారు. దేశంలో ఎన్నికల సంస్కరణాలు రావాల్సిన అవసరముందనీ, దామాషా పద్ధతిన ఎన్నికలను నిర్వహించాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సిపిఐ రాష్ట్ర సమితి సమావేశం సందర్భంగా గురువారం హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందే ఫాసిస్టు, మతతత్వ బిజెపికి వ్యతిరేకంగా జాతీయ స్థాయిలో ఉమ్మడి అవగాహనకు రావాల్సిన అవసరముందని పేర్కొన్నారు. ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను, అధికారాలను కేంద్ర ప్రభుత్వం అణచివేస్తోందని విమర్శించారు. జాతీయ విద్యా విధానాన్ని, జిఎస్‌టిని కేంద్రం రాష్ట్రాలపై బలవంతంగా రుద్దుతున్నదని చెప్పారు. భారతదేశం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ సంపదను మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు దోచిపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేల కొనుగోలు అంశంలో రాష్ట్రంలో విచారణ కొనసాగుతున్నదనీ, మిగతా రాష్ట్రాల్లోనూ బిజెపి ఇలాగే ప్రవరిస్తున్నదని అన్నారు. సంక్షేమ దేశంగా ఉన్న భారత్ మోడీ పాలనలో పెట్టుబడి భారత్‌గా మారుతున్నదని చెప్పారు. రోజురోజుకూ నిత్యావసర ధరలు, నిరుద్యోగం విపరీతంగా పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలను ఇస్తామన్న మోడీ హామీ ఏమైందని నిలదీశారు. ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వ పాలనలో గవర్నర్ల జోక్యం ఏమిటని ప్రశ్నించారు. కేరళ, తమిళనాడు, బెంగాల్‌తోపాటు తెలంగాణలో కూడా గవర్నర్ వ్యవస్థను కేంద్రం ఉపయోగిస్తున్నదని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రజాస్వామ్య, రాజ్యాంగ, లౌకిక పరిరక్షణకు వామపక్ష, ప్రజాతంత్ర, లౌకిక, ప్రాంతీయ పార్టీలు ఏకమై బిజెపికి వ్యతిరేకంగా 2024 లోక్‌సభ ఎన్నికల్లో అవగాహనతో ముందుకెళ్లాలని కోరారు. మారుతున్న రాజకీయ పరిణామాలను, బిజెపి ప్రమాదాన్ని కాంగ్రెస్ అర్థం చేసుకోవాలని సూచించారు. మరో రెండేండ్లలో సిపిఐ శతాబ్ది వార్షికోత్సవానికి చేరుకోబోతున్నదనీ, ఈ క్రమంలో పార్టీ సభ్యత్వాన్ని ఒక మిలియన్‌కు చేర్పించాలన్నదే తమ లక్ష్యమని వివరించారు. ప్రయివేటు విమానాల ద్వారా హవాలా డబ్బు, బంగారు ఆభరణాలు తరలుతున్న నేపథ్యంలో వాటిని కూడా తనిఖీ చేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ డిమాండ్ చేశారు.

సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా మాట్లాడుతూ వామపక్ష, ప్రజాతంత్ర పార్టీలు ఏకమైతే బిజెపిని ఓడించడం సులువవుతుందన్నారు. ఎన్నికల సమయంలోనే పొత్తుల అంశంపై చర్చలుంటాయనీ, అప్పటి వరకు ప్రజా సమస్యలపై పోరాటం చేస్తామని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి, జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మరో రెండు భవన నిర్మాణ వ్యర్థాల ప్లాంట్లు

- సేకరణకు ప్రత్యేక టోల్‌ఫ్రీ నెంబర్లు : మేయర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భవన నిర్మాణ, కూల్చివేసిన వ్యర్థాలను రోడ్డుపైన, నాలాలో, ఫుట్‌పాత్, చెరువుల్లో, అనుమతిలేని ప్రదేశాల్లో వేయడంతో ప్రజలు ఇబ్బందులకు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో నిర్మాణ వ్యర్థాలను సేకరించడానికి జిహెచ్ఎంసి చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. నిర్మాణ వ్యర్థాలు ఎప్పటికప్పుడు తరలించేందుకు ప్రయివేటు భాగస్వామ్యంతో మరో రెండు సైక్లింగ్ యూనిట్ల ఏర్పాటుకు జిహెచ్ఎంసి చర్యలు తీసుకుంది. ఒక ప్లాంట్ సికింద్రాబాద్ జోన్ శామీర్‌పేట మండలం తూముకుంట గ్రామంలో, మరొకటి చార్మినార్ జోన్ శంషాబాద్ షాతంరాయి గ్రామంలో ఏర్పాటు చేశారు. గతంలో జీడిమెట్ల, ఫతుల్లగూడ ప్లాంట్లూ ముందుగా సేకరణ చేసి ప్లాంట్ వరకు తరలించి నిల్వ చేసుకునే వారు. ఆ తర్వాత పూర్తిగా ప్లాంట్ల నిర్మాణం చేపట్టి రీసైక్లింగ్ చర్యలు ప్రారంభించారు. నూతనంగా ఏర్పాటు చేసిన ప్లాంట్లు సైతం అదే తరహాలో వ్యర్థాలు సేకరణ చేసుకుని ఆ తర్వాత రీసైక్లింగ్ చర్యలు చేపట్టనున్నారు. ఈ ఒక్కొక్క ప్లాంట్ రోజుకి 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యమున్న వ్యర్థాలను రీసైక్లింగ్ చేయనున్నట్టు అధికారులు చెబుతున్నారు. హైదరాబాద్ నగరం నలువైపులా నాలుగు ప్లాంట్ల ఏర్పాటుకు జిహెచ్ఎంసి చర్యలు తీసుకుంది. ముందుగా రెండు సి అండ్ డి ప్లాంట్లను జీడిమెట్ల, ఫతుల్లగూడలో ఒక్కొక్కటి 500 మెట్రిక్ టన్నుల కెపాసిటీతో ఏర్పాటు చేశారు.ఒక్కొక్క ఏజెన్సీ రెండేసి ప్లాంట్‌లు ఏర్పాటు చేసిన నేపథ్యంలో ఒక ఏజెన్సీకి 15 సర్కిళ్లు మరొక ఏజెన్సీకి మరో 15 సర్కిళ్లను కేటాయించారు. ఈ ఏజెన్సీ ప్రయివేటు వ్యక్తుల వ్యర్థాలను తరలించేందుకు టోల్ ఫ్రీ నెంబర్‌నూ ఏర్పాటు చేశారు. అవసరమైనవారు టోల్‌ఫ్రీ నెంబర్‌ను సంప్రదిస్తే ఇంటి వద్దకే వచ్చి అట్టి వ్యర్థాలను తీసుకెళ్తారు. అందుకు కలెక్షన్, రవాణా, ప్రాసెసింగ్ చార్జీలు.. జిహెచ్ఎంసి నిర్దేశించిన ప్రకారంగా టన్నుకు వసూలు చేస్తారు. జీడిమెట్ల కలెక్షన్ ఏరియాకు ఎనిమిది సర్కిళ్లను కేటాయించారు. వాటిలో యూసుఫ్‌గూడ, శేరిలింగంపల్లి, చందానగర్, ఆర్‌సీపురం, పటాన్‌చెరు, మూసాపేట, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, గాజులరామారం ఉన్నాయి. ఫతుల్లాగూడ కలెక్షన్ ఏరియాకు ఏడు సర్కిళ్లను కేటాయించారు. వాటిలో ఉప్పల్, హయత్‌నగర్, ఎల్బీనగర్, సరూర్‌నగర్, మలక్‌పేట్, సంతోష్‌నగర్, అంబర్‌పేట్ ఉన్నాయి. షాతంరాయి విలేజ్ శంషాబాద్ కలెక్షన్స్ ఏరియా కేటాయించిన వాటిలో చాంద్రాయణగుట్ట, చార్మినార్, ఫలక్‌నుమా, రాజేంద్రనగర్, మెహిదీపట్నం, కార్వాన్, గోషామహల్, జూబ్లీహిల్స్ ఉన్నాయి. శామీర్‌పేట్ మండలం తూముకుంట కలెక్షన్ ఏరియాలో ఏడు సర్కిళ్లు ఉన్నాయి. నగరంలో నిర్మాణ వ్యర్థాల వల్ల ప్రజలు ఇబ్బందిని గమనించి ఉత్తరం, దక్షిణం వైపు ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామని మేయర్ తెలిపారు.